TGTEL/26/A0372

# మన మహతి న్యూస్

## తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : బజ్జుర్ల శ్రీనివాస్, డాక్టర్. ప్రకాస్ జాదవ్ సంపుటి : 01 సంచిక : 25 గురువారం, ఫిబ్రవరి 19, 2026 , పేజీలు - 5 వెల: 4/- manamahatinews.com

# హైదరాబాద్ ఇక 'నెట్ జీరో' సిటీ.. ఇండస్ట్రీలన్నీ అవుట్

**ముంబయి,మహారాష్ట్ర :** గ్రీన్ ఎనర్జీ ప్రపంచ పరిరక్షణకు లాభదా యకమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రా యపడ్డారు. మహారాష్ట్ర ప్రభుత్వం ముం బయిలో నిర్వహించిన 'క్లైమేట్ వీక్' సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగి ంచారు. బాంద్రా కుర్లా జియో కన్వెన్షన్ సెంట ర్‌లో బుధవారం ఉదయం జరిగిన ఈ సమా వేశంలో దేశంలోని పట్టణాలు, నగరా భివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణమైన విధా నాలపై ముఖ్యమంత్రి తెలంగాణ దృక్పథాన్ని వివరి ంచారు. దేశ పట్టణాభివృద్ధికి సంబం ధించిన సదస్సులో మాట్లాడడం తనకు సంతో షంగా ఉందన్నారు. 2047 లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలంటే 1947 నుంచి భారత అభివృద్ధి ప్రయాణాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని అన్నారు.తెలంగాణలో గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో గ్రీన్ ఎనర్జీకి తాము ప్రోత్సాహిస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ 30 లక్షలకు పైగా పంప్‌సెట్‌లు, దాదాపు 50 లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. ఈ శక్తిని




బొగ్గు, సాంప్రదాయ ఇంధన వనరుల నుంచి సోలార్, గ్రీన్ ఎనర్జీ వైపు మార్చుడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. కాలుష్య నియంత్రణ, రీసైక్లింగ్, స్థిర శక్తి ఉత్పత్తి పద్ధతులపై నిరంతరం పరిశోధనలు కొనసాగిస్తున్నామన్నారు హైదరాబాద్‌ను 2034 నాటికి నెట్ జీరో నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరు ద్ఘాటించారు. పట్టణాభివృద్ధిలో భాగంగా తాము కార్బన్ ఫుట్‌ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందని తెలి పారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియ న్(క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టం చేశారు.అభివృద్ధి ప్రస్థానం – విద్య, సాగునీరు స్వాతంత్ర్యం అనంతరం తొలి నాలుగు దశాబ్దాల్లో దేశంలో ప్రధాన ప్రాధాన్యతలు విద్యా వ్యవస్థ, నీటిపారుదల రంగాలేనని గుర్తు చేశారు. గ్రామీణ ప్రాథమిక పాఠశాలల నుంచి వంటి ప్రతిష్ఠాత్మక విద్యాస ంస్థలను ఏర్పాటు చేసుకున్నామని గుర్తు చేశారు. విద్యుత్, సాగునీటికి భారీ ఆనకట్టలను నిర్మించి రైతుల పొ లాలను నీటితో అనుసంధానించామని తెలిపారు. 1990 నాటికి భారత్ ఆహార కొరత నుంచి ఆహార భద్రత సాధించిందని చెప్పారు. దీంతో ప్రజల జీవిత కాలం పెరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. దేశంలోని ఇంజినీర్లు, ప్రపంచవ్యాప్తంగా వివరించారు.

### కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులు ఖరారు

# రేవంత్ కోరుకున్న వారికే



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఏకపక్షంగా విజయం సాధించటంతో అధినాయకత్వం ఇక కొత్త నిర్ణయాలతో సిద్దం అవుతోంది. అందులో భాగంగా ప్రభుత్వం.. పార్టీలో రేవంత్ కోరుకున్న విధంగా పదవుల ఖరారు.. మార్పుల దిశగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో.. ప్రస్తుతం కేబినెట్ లో ఉన్న ఖాళీల భర్తీతో పాటుగా రెండు మూడు మార్పులు ఖాయంగా కనిపిస్తోంది. పార్టీ.. ప్రభుత్వంలో కీలక పదవులను భర్తీ చేసేందుకు తుది కసరత్తు జరుగుతోంది.ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ నేతలతో కలిసి ఢిల్లీలో మకాం వేసారు. ఇక.. రాజకీయంగా మరింత బలోపేతం కావాలని రేవంత్ భావిస్తున్నారు. అందుకు హైకమాండ్ సైతం ఫ్రీ హ్యాండ్ ఇచ్చేలా నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా కేబినెట్ విస్తరణ.. నామినేటెడ్ పదవుల్లో రేవంత్ లిస్టుకు ఆమోదం తెలిపేందుకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చింది. అయితే.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ అజారుద్దీన్ కు మంత్రి పదవి ఇచ్చిన సమయంలో సీనియర్లకు నామినేటెడ్ పదవులు అప్పగించారు.

### పారదర్శకంగా ఇందిరమ్మ

# ఇళ్లను అందజేస్తాం

**: మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** హైదరాబాద్ జిల్లాలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ భరోసా కల్పించారు. సచివాలయంలో హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ ఇవాళ( బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఫా1 కింద 4,800 మందికి రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇచ్చామని స్పష్టం చేశారు.2 కింద హైదరాబాద్ నుంచి 4.22 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. భాగ్యనగరంలో స్థలాల సేకరణతో +ం5 నుంచి +ం10 వరకు ఇళ్ల నిర్మాణ ప్లాన్ చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో పెండింగ్ డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే, మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీల ఏర్పాటుపై మంత్రులు సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్లను పారదర్శకంగా అందజేస్తామని.. నిజమైన లబ్ధిదారుల ఎంపికే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# బాల్క సుమన్ అరెస్టును ఖండించిన హరీష్‌రావు

**హైదరాబాద్ :** క్యాతనపల్లిలో కాంగ్రెస్ అప్రజాస్వామిక, అహంకార చర్యలను అడ్డుకున్నందుకు మాజీ శాసనసభ్యులు, దళిత నాయకుడు బాల్క సుమన్ ను అరెస్టు చేసి నిర్బంధించడాన్ని మాజీ మంత్రి హరీష్‌రావు (ఖుతీఅంష్ట్ర ఖుశీ) తీవ్రంగా ఖండించారు.క్యాతన్ పల్లిలో బీఆర్ఎస్ పార్టీకి పూర్తి మెజారిటీ వచ్చినా కూడా కాంగ్రెస్ పార్టీ పట్టపగలు ప్రజాస్వామ్యాన్ని పరిహసించిన తీరు చూసి యావత్ తెలంగాణ అసహ్యించుకుంటున్నదని అన్నారు. అధికార బలం, పోలీసు బలం, ధన బలంతో చట్టాలను తుంగలో తొక్కడం కాంగ్రెస్ అరాచక వైఖరికి పరాకాష్ట అని దుయ్యబట్టారు.తెలంగాణ ప్రత్యేకతలురాష్ట్రమంతా కాంగ్రెస్ మార్కు గూండాగిరి రాజ్యమేలుతున్నది. మున్సిపల్ ఎన్నికల వేళ కాంగ్రెస్ మురుగు రాజకీయాల వాసన కమ్ముకున్నది. హంగ్ వచ్చిన చోటల్లా ప్రతిపక్ష నాయకులను సంత భేరం చేస్తూ, కిడ్నాపులకు తెగబడుతూ ప్రజా తీర్పును కాలరాస్తున్న తీరుకు నిదర్శనాలు ఎన్నోనని అన్నారు.జనగాంలో దళిత మహిళా కౌన్సిలర్ బీఆర్ఎస్‌కు మద్దతుగా చెయ్యి ఎత్తితే రిటర్నింగ్ ఆఫీసర్ సాక్షిగా కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని సమాజం కళ్లారా చూసిందని వెల్లడించారు. తమ కళ్ళెదుట ఒక దళిత మహిళా నాయకురాలిపై కాంగ్రెస్ నాయకులు దాడికి తెగబడితే అధికారులు, పోలీసులు కళ్లప్పగించి చోద్యం చూశారే తప్ప అడ్డుకోలేదని అన్నారు.ఒక్క క్యాతనపల్లే కాదు తొర్రూరు, జనగాం, ఇబ్రహీంపట్నం, జహీరాబాద్ సహా హంగ్ వచ్చిన ప్రతి చోటా ప్రజా తీర్పును గౌరవించకుండా చైర్మన్ పీఠాలను అడ్డదారుల్లో దక్కించుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో భూములను కబ్జా చేసినట్లే, రాజకీయ పీఠాలను కూడా కబ్జా




చేస్తున్నారని ఆరోపించారు. బాల్క సుమన్ ను భేషరతుగా విడుదల చేయాలని, ప్రజాస్వామిక వాతావరణంలో క్యాతన్ పల్లి చైర్మన్ ఎన్నిక జరిగేలా బాధ్యత వహించాలని ఎన్నికల కమిషన్ ను డిమాండ్ చేశారు.

# తెలంగాణ నుంచి రాజ్యసభకు ఆ ఇద్దరు ఫిక్స్, కాంగ్రెస్ అనూహ్య ఎంపిక




**హైదరాబాద్ :** కాంగ్రెస్ అధినాయకత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావటంతో.. అభ్యర్థుల ఖరారు పైన ఒక నిర్ణయానికి వచ్చింది. తెలంగాణ నుంచి ఇద్దరు సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. వారి స్థానంలో పార్టీ ఇద్దరు అభ్య ర్థులను దాదాపు ఖరారు చేసింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ తో చర్చల తరువాత ఈ నిర్ణయం తీసుకుందని సమా చారం. అయితే, బీఆర్ఎస్ పోటీకి దిగకుంటే కాంగ్రెస్ అభ్యర్థులు ఇద్దరు ఏకగ్రీవంగా పెద్దల సభకు వెళ్లటం ఖాయంగా కనిపి స్తోంది.రాజ్యసభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల అయింది. తెలం గాణ సహా 10 రాష్ట్రాల్లో 37 స్థానాలకు ఎన్నికలు జరగ ౕనున్నాయి. అందులో తెలంగాణ నుంచి రెండు స్థానాలకు ఎన్నికలు జరగను న్నాయి. ప్రస్తుతం తెలంగాణ నుంచి పెద్దల సభలో సభ్యులుగా ఉన్న బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ పదవీ కాలం ఏప్రిల్ 9వ తేదీతో ముగియనుంది. వీరి స్థానంలో తెలంగాణ నుంచి ఇద్దరు సభ్యులు ఎంపిక కావాల్సి ఉంది. అసెంబ్లీలో ఉన్న సంఖ్యా బలంతో కాంగ్రెస్ రెండు స్థానాలు దక్కించుకోవటం సులభంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చే అవకాశం ఉంది. దీంతో.. రెండు స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసింది. ఢిల్లీ వర్గాల సమాచారం మేరకు ప్రస్తుత సభ్యులు అభిషేక్ సింఘ్వీ కి తిరిగి రెన్యువల్ కానుంది. సింఘ్వీ ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం న్యాయ వ్యవహారాల్లో కీలకం గా మారారు. అదే సమయంలో కాంగ్రెస్ కనిపిస్తోంది.

# ధరణి దోపిడీపై ఉక్కుపాదం

**: మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్, ఫిబ్రవరి 18 :** ధరణి దోపిడీపై ఉక్కుపాదం మోపుతామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. సచివాలయంలో ధరణిపై ఉన్నత స్థాయి కమిటీతో మంత్రి పొంగులేటి ఇవాళ(బుధవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ధరణి వ్యవహారంలో తీగ లాగితే డొంక కదిలినట్లు అక్రమాలు బయ ట పడుతున్నాయని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ విచారణలో స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజుల భారీ దోపిడీ బయటపడిందన్నారు. ధరణి పోర్టల్‌లో లోపాలు సాంకేతికం కాదని.. వ్యవస్థాగతంగా సృష్టించినవేనని తెలిపారు.అనుమానాస్పద భూముల డేటా, లాగిన్ వివరాలు డిలీట్ చేసినట్లు గుర్తించామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. వెంటనే ధరణి పోర్టల్‌పై కోడ్ ఆడిట్ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విదేశీ సంస్థ టెర్రాసిస్ నిర్వహణ వల్లే సమస్యలంటూ ఆరోపణలు వచ్చాయని చెప్పుకొచ్చారు.

### ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై స్టే ఎత్తివేత..

# వారిదే నిర్ణయమన్న హైకోర్టు




**హైదరాబాద్, ఫిబ్రవరి 18:** ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికకు లైన్ క్లియర్ అయ్యింది. మున్సిపల్ ఎన్నికపై గతంలో ఉన్న స్టేను తెలంగాణ హైకోర్టు ఎత్తివేసింది. ఈసీ, కలెక్టర్ తుది నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. ఇబ్రహీం పట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికపై ఈరోజు (బుధవారం) హైకోర్టులో విచారణ జరి గింది. ఈ ఎన్నికపై రెండు రోజుల క్రి తమే హైకోర్టు స్టే విధించగా.. దాన్ని ఎతి వేస్తూ న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది.మరోవైపు ఇబ్రహీంపట్నం 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి మిస్సింగ్‌పై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలైంది. దీనిపై ఈరోజు విచారణ జరుగగా.. యాదగిరిని కోర్టు ముందు హాజరుపర్చారు ఇబ్రహీపట్నం పోలీ సులు. అతడి స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానం రికార్డ్ చేసింది. బీఆర్ఎస్ నేతలు తనను బలవ ంతంగా చీరాలకు తీసుకెళ్లి రిసార్ట్‌లో బంధించారని, ఎన్నికల ఫలితాలు వచ్చిన రోజు దాదాపు 12 గంటల పాటు హైదరాబాద్ మొత్తం తిప్పి చీరాలకు తీసుకెళ్లారని యాదగిరి ఇచ్చారు.

# రైతులకు ఏపీ ప్రభుత్వం గుడ్‌న్యూస్, ఖాతాల్లో నిధులు జమ

**అమరావతి :** ఏపీ ప్రభుత్వం రైతులకు బిగ్ అప్డేట్ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం రైతుల కోసం వరు సగా నిర్ణయాలు అమలు చేస్తోంది. ధాన్యం సే కరణ నిధులను 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించింది. ఇక, ఈ నెలలోనే అన్న దాత సుఖీభవ మూడో విడత నిధులను పీఎం కిసాన్ తో కలిపి జమ చేసేందుకు ప్రభు త్వం కసరత్తు చేస్తోంది. పీఎం కిసాన్ నిధులు వచ్చే వారం జమ అయ్యే ఛాన్స్ ఉంది. కాగా.. తాజాగా వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు శనగల సేకరణ... ధరల పైన రైతులకు గుడ్ న్యూస్ చెప్పారు.ఏపీ ప్రభుత్వం రైతుల కోసం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రైతుల నుంచి శనగల సేకరణ చేసేందుకు సిద్దమైంది. నెల నుంచి శనగల కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు వ్యవసా యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటి ంచారు. అంతేకాదు శనగలు కొనుగోలు చేసిన అనంతరం 15 రోజుల్లోనే నగుదును రైతుల బ్యాంక్ అకౌంట్లలో నేరుగా జమ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. నగదు



చెల్లింపుల ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. ఈ రోజు నుంచి రాష్ట్రంలో రైతుల నుంచి శనగల కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రబీ సీజన్ 2025-26లో పండించిన శనగలను కొనుగోలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. శనగలను కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయని, దీని ప్రకారం ఫిబ్రవరి 18 నుంచి సీఎం యాప్ ద్వారా అన్ని జిల్లాల్లో కొనుగోళ్లు చేపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు అచ్చెన్నాయుడు తాజా ప్రకటనలో పేర్కొన్నారు.కాగా, రాష్ట్రంలో రబీ సీజన్ లో 3.25 లక్షల హెక్టార్లలో శనగల సాగు జరిగినట్లు అధికారిక లెక్కలు వెల్లడి ంచాయి. ఇందులో భాగంగా దాదాపు 3.77 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగినట్లు ప్రభుత్వం అంచనా. అయితే, ముందుగా రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్ తమ పంటను నమోదు చేయించుకోవాలి. సీఎం యాప్ ద్వారా వీటి కొనుగోళ్లు చేపట్టేలా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. కొనుగోలు చేసిన శనగలను చేయనున్నారు.

# మాల్కాపూర్ లో కూరగాయల మార్కెట్ ను ప్రారంభించిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి.





**సంగారెడ్డి, ఫెబేవరి 18,మన మహతి న్యూస్ :**
కొండాపూర్ మండలం మాల్కాపూర్ గ్రామం లో నూతనంగా ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ ను బుధవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. గ్రామం లో ప్రత్యేకంగా ప్రతీ బుధవారం కూరగాయల మార్కెట్ నిర్వహించేలా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కూరగాయల మార్కెట్ లో తిరుగుతూ పలువురు కూరగాయల అమ్మే మహిళల తో నిర్మలా జగ్గారెడ్డి ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజల సౌకర్యం కోసం ప్రత్యేకంగా బుధవారం రోజున కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. మాల్కా పూర్ గ్రామం లో మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా నాలుగు భవనాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే రెండు భవనాలు పూర్తి అయ్యాయని, మరో రెండు భవనాలు త్వరలో సిద్ధం అవుతాయని తెలిపారు. ఇచ్చిన మాటకు కట్టుబడే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, త్వరలో నే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలవుతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో మాల్కా పూర్ గ్రామ సర్పంచ్ అనిల్, ఉప సర్పంచ్ ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అలవేని నర్సింహా రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో కాంగ్రెస్ నేత పొన్న శంకర్ రెడ్డిపై సస్పెన్షన్.

**- మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల ఓటమికి పనిచేశారన్న ఆరోపణలు.**





**సంగారెడ్డి,ఫిబ్రవరి 18,మన మహతి న్యూస్:**
సంగారెడ్డి పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పొన్న శంకర్ రెడ్డిపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ విషయాన్ని ఎం. జార్జ్ బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 12వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి ప్రవీణ్ కుమార్‌కు వ్యతిరేకంగా పని చేసినందున శంకర్ రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జార్జ్ మాట్లాడుతూ, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. గతంలో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో కూడా శంకర్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేశారని, అప్పట్లో సస్పెండ్ చేసినప్పటికీ అధిష్టానం వద్ద క్షమాపణలు కోరడంతో సస్పెన్షన్ ఎత్తివేసిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, ఈసారి మున్సిపల్ ఎన్నికల్లో ఆయన అన్నకొడుకు 12వ వార్డులో భారత రాష్ట్ర సమితి టికెట్‌పై పోటీ చేసిన సందర్భంగా శంకర్ రెడ్డి బీఆర్ఎస్‌కు అనుకూలంగా పనిచేశారని ఆరోపించారు. ముఖ్యంగా పోతిరెడ్డిపల్లి పరిధిలోని మూడు వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి ఆయన చర్యలే కారణమయ్యాయని పేర్కొన్నారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా వ్యవహరించినందున క్రమశిక్షణ చర్యగా సస్పెన్షన్ విధించినట్లు జార్జ్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో తోపాజీ అనంతకిషన్, సంగారెడ్డి మున్సిపల్ వైస్ ఛైర్మన్ షఫీ హఫీజ్, పార్టీ సీనియర్ నాయకులు బొంగుల రవి, కూన సంతోష్, మహేష్ ముదిరాజ్, కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు.

# విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- షీ టీమ్ పోలీసులు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్**

**మన మహతి న్యూస్ ప్రతినిధి నారాయణపేట జిల్లా.**
విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ పోలీసులు సూచించారు. మంగళవారం రోజు గుండుమల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు, కవిత లు మాట్లాడుతూ... విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోయే సమయంలో ఎవరైనా అపరిచిత వ్యక్తుల వల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురైనప్పటికీ వెంటనే షి టీమ్ పోలీసులకు లేదా టి–సేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, ఎవరైనా తెలిసిన వారైనా సరే బైక్ పై లిఫ్ట్ ఇస్తానంటే అమ్మాయిలు వెళ్లరాదని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు అలాగే సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పాఠశాలలు ఎవరైనా ర్యాగింగ్ లేదా ఈవ్ టీజింగ్ కు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేధింపులకు గురైన విద్యార్థులు షీ టీమ్ సెల్ నం: 8712670398 కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు సెల్ఫోన్ వినియోగాన్ని తగ్గించాలని,




# తిరువూరు నియోజకవర్గానికి ఎం.ఎస్.ఎం.ఈ పార్కులు - లెదర్ పార్కులు - ప్రజలకు నివాస స్థలాలు పై సమగ్ర సర్వే చేసి నియోజకవర్గ ప్రజలకు మేలు చేయండి-ఆదుకోండి!

**- అసెంబ్లీలో శాసన సభ్యులు కొలికపూడి విన్నతి!**

**మన మహతి ప్రతినిధి:భ్రమరాంబ అమరావతి న్యూస్:ఫిబ్రవరి.20**
అసెంబ్లీ సమావేశంలో శాసనసభ్యులు మాట్లాడుతూ గత సంవత్సన్నర కాలంలో జరుగుతున్న అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ ఎం ఈ - పార్కులు అలాగే తిరువూరు నియోజకవర్గంలో లెదర్ పార్క్ ఏర్పాటు చేయుటకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్లో భాగంగా త్వరగతిన భూసేకరణ చేసి లెదర్ పార్క్ ఏర్పాటు చేయాలని కోరిన శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు పట్టణం పక్కనే ఉన్న రామన్నపాలెం గ్రామంలో జమీందారీ వ్యవస్థ రద్దు అవ్వడంతో వారి వద్ద నుండి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న వందలాది ఎకరాల భూమిని సమగ్ర సర్వే చేసి వాటిని తిరువూరు పరిసర ప్రాంతాల్లోని పేద ప్రజలకు నివాస స్థలాలుగా కేటాయించాలని కోరిన శాసనసభ్యులుఅలాగే నియోజకవర్గ పరిధిలో చాలా ప్రాంతాలలో నివాస గృహాల భూములను 22.ఏ- లో కలపటం జరిగింది,వాటిని కూడా వీలైనంత త్వరగా 22.ఏ -నుండి విముక్తి చేసి పేదలకు మేలు చేసే కార్యక్రమంలో సహకరించవలసిందిగా ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసిన శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు



# తలసిల చంద్రశేఖర రావు భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన-వైయస్సార్సీపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి

**మన మహతి ప్రతినిధి:భ్రమరాంబ విజయవాడ న్యూస్:ఫిబ్రవరి. 20**
వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తండ్రి తలశిల చంద్రశేఖర్ రావు భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళు లర్పించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నివైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ తండ్రి తలశిల చంద్రశేఖర్ రావు (88)మరణం పట్ల మాజీముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైయస్ జగన్ గొల్లపూడిలోని తలశిల రఘురామ్ నివాసానికి వెళ్లి చంద్రశేఖర్ రావు భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. చంద్రశేఖర్ రావు మరణం తలశిల రఘురామ్ కి,కుటుంబ సభ్యులకు తీరని లోటని తెలిపారు. ఈ దుఃఖ సమయంలో తలశిల రఘురామ్ కి,వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, చంద్రశేఖర్ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నానని వైయస్ జగన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవినేని అవినాష్ మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు, పాల్గొన్నారు.



# ప్రతి బస్తి కాలనీలలో అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి

**- మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**



**శేరిలింగంపల్లి మన మహాతి న్యూస్ ఫిబ్రవరి 18:**
గచ్చిబౌలి డివిజన్ పరిధిలోనీ నానక్ రామ్ గుడా లో రూ 48.00 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాలనీ వాసులు మరియు జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించిన గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ రోడ్ నిర్మాణ పనుల్లో నాణ్యతా విషయంలో ఎక్కడా కూడా రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని అదేవిధంగా రాబోవు కాలంలో కాలనీ వాసులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా లెవెల్స్ సరి చూసుకుంటూ వీలైనంత త్వరగా సీసీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులకు వారు సూచించారు. గచ్చిబౌలి డివిజన్ లో ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదేవిధంగా భవిష్యత్తులో కూడా మరిన్ని పనులు చేపట్టి కాలనీలలో మౌనిక వసతులు కల్పించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. గచ్చిబౌలి డివిజన్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ నిఖిల్,,గచ్చిబౌలి డివిజన్ అధ్యక్షులు శివ సింగ్, సీనియర్ నాయకులు మల్లేష్ , శ్రీకాంత్ రెడ్డి, ఉమేష్, శేఖర్,సింగ్,సుమన్,తుకారాం, మహేందర్, శ్రీకాంత్,నగేష్, అరవింద్, సహదేవ్,నానక్ రామ్ గుడా వాసులు,స్థానిక నేతలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగా వైభవంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం

**- ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ రాగం**



**శేరిలింగంపల్లి మన మహతి న్యూస్ ఫిబ్రవరి 18:** రాజీవ్ గృహకల్పలో మాజీ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సొంత ఖర్చులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ షిర్డీ సాయినాథ, మార్ఖండేయ మరియు సంతాన నాగదేవత అమ్మవారి ప్రతిష్ట కార్యక్రమం మెదటి రోజులో భాగంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య రాగం వారి కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా గణపతి పూజ, గోపూజ, వేద పఠనము, పుణ్యాఃవాచనము, పంచగవ్య ప్రాశనము, ఋత్విక్వరణము, దీక్షాధా రణ, యాగాశాల ప్రవేశము, అఖండ దీపారాధన, అంకురార్పణము, అగ్ని ప్రతిష్ట, వాస్తు, యోగిని, నవగ్రహ, క్షేత్ర పాలక, సర్వతోభద్ర, మండప స్థాపన, ప్రధాన కలశ స్థాపన, హారతి మరియు ప్రత్యేక పూజలను క్రమబద్ధంగా నిర్వహించిన రాగం వారి దంపతులు. ఈ కార్యక్రమంలో పురప్రముఖులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు భక్తులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

# అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాలుడిని మానవత్వంతో ఆదుకోవాలి



**మన మహతి న్యూస్ ప్రతినిధి పాల్వంచ:**
రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్.మాజీ చైర్మన్ కొత్వాలపాత పాల్వంచ గ్రామస్థుల ద్వారా బద్రి అనే బాలుని కుటుంబానికి 1 లక్షా 53 వేల రూపాయల ఆర్థిక సాయం అందచేశారు. 46వ డివిజన్ పాత పాల్వంచకు చెందిన సీతారామరాజు, ప్రమీల దంపతుల కుమారుడు బద్రి ఇటీవల అనారోగ్యంతో పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య చికిత్స నిమిత్తం వెళ్ళగా ఇంజక్షన్ వికటించి తీవ్ర అనారోగ్యం పాలవగా, విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యానికి లక్షలాది రూపాయలు అవసరమవుతుండగా పాత పాల్వంచలోని కొంత మంది దాతలు మానవత్వంతో లక్షా యాభై మూడు వేల రూపాయలు సేకరించారు. పాత పాల్వంచలోని కొత్వాల స్వగృహంలో బుధవారం ఈ పైకాన్ని కొత్వాల తోపాటు 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి లు బాలుడి తండ్రి సీతారామరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ బాలుడి చికిత్సకు లక్షల రూపాయలు అవసరం వుందని, దాతలు విరాళాలు ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు శిరీష,గౌరీ, నాగమణి,ఆదిలక్ష్మి, వినయ్,వసుమల్ల సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కన నాటిన హరితహారం చెట్లకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు.



**మన మహతి న్యూస్ ప్రతినిధి.నారాయణపేట జిల్లా,**
మక్తల్ పట్టణం సమీపంలోని కర్నే గ్రామం ఊరి చివర రోడ్డుపక్కన నాటిన హరితహారం చెట్లను కొందరు దుండగులు తగలబెట్టిన ఘటన అత్యంత దురదృష్టకరం మరియు ఖండనీయము. సుమారు 30 నుండి 50 వరకు చెట్లు దహనం చేయబడ్డాయి.ఇంత పెద్ద ఘటన జరిగి గ్రామపంచాయతీ సెక్రటరీ మరియు ఫారెస్ట్ శాఖ అధికారుల నుండి ఎటువంటి స్పందన లేకపోవడం ప్రజల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమానికి ఇది పెద్ద దెబ్బ.అందువల్ల: హరితహారం చెట్లను తగలబెట్టిన వ్యక్తులను వెంటనే గుర్తించాలి.వారి పై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలి.బాధ్యతలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి.లేనిపక్షంలో, ప్రజలు సంబంధిత ఉన్నతాధికారులకు అధికారిక ఫిర్యాదు చేయడానికి సిద్ధంగా ఉన్నారు.ఈ విషయాన్ని అత్యంత ప్రాముఖ్యంగా తీసుకుని తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజల తరపున కోరుతున్నారు

# తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార ఫెడరేషన్ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ 2026-డైరీని ఆవిష్కరించిన మంత్రి వాకిటి శ్రీహరి



**మన మహతి న్యూస్ ప్రతినిధి.**హైదరాబాద్ లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో తెలంగాణ పాడి పారిశ్రామికాభివృద్ధి సహకార ఫెడరేషన్ స్టాఫ్ వర్కర్స్ యూనియన్ 2026-డైరీని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్టాఫ్ వర్కర్స్ యూనియన్ సభ్యులకు మంత్రి వాకిటి శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు. రావిర్యాలలోని మెగా డెయిరీని సందర్శించాలని యూనియన్ సభ్యులు కోరగా, త్వరలో వస్తానని మంత్రి తెలిపారు. అయితే రైతులకు రూ.4 ఇన్సెంటివ్ ఇచ్చేలా బడ్జెట్ లో కేటాయించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని మంత్రి వాకిటి శ్రీహరిని కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, జనరల్ సెక్రటరీ బాల్ ప్రసాద్, ట్రెజరరీ నిఖిల్, ఆనంద్, శ్రీధర్, రాజు, ఈశ్వర్, సతీష్, కరీం, శరత్ లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం -- సదాశివపేట మున్సిపల్ పాలకవర్గానికి నిర్మలా జగ్గారెడ్డి సూచన.




**సంగారెడ్డి,ఫిబ్రవరి 18,మన మహతి న్యూస్ :**
సదాశివపేట మున్సిపల్ చైర్మన్‌గా మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా రేణుక చిరు బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను ఆమె సన్మానించి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే మున్సిపల్ పాలకవర్గం ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు. అభివృద్ధి నిధులను పారదర్శకంగా, సక్రమంగా వినియోగిస్తూ పట్టణాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా పని చేయాలని నూతన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు సూచించారు.ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సత్యనారాయణ, చిరు, అరుణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# నెమలి గ్రామంలో నిర్మించునున్న విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేసిన శాసనసభ్యులు కొలికపూడి




**మన మహతి ప్రతినిధి:భ్రమరాంబ గంపలగూడెం న్యూస్:ఫిబ్రవరి.20**
గంపలగూడెం మండలం,నెమలి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న 33/12కేవీ సామర్థ్యం గల విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేసిన శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు గతంలో ఈ ప్రాంత ప్రజలు లోవోల్టేజి సమస్యను శాసనసభ్యులు దృష్టికి తీసుకువెళ్లగా,సానుకూలంగా స్పందించి శాసనసభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపించి నెమలి గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేపిస్తున్నందుకు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన గ్రామ ప్రజలు.

# 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడా మహోత్సవంలో సంగారెడ్డి జిల్లాకు 6 పతకాలు.

**- విజేత క్రీడాకారులకు అభినందనలు తెలియజేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్.**





**సంగారెడ్డి,ఫిబ్రవరి 18,మన మహతి న్యూస్ :**
4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సంగారెడ్డి జిల్లా పోలీస్ సిబ్బంది విశిష్ట ప్రతిభ కనబరిచి మొత్తం 5 పతకాలను సాధించారు. మూడవ రోజు ముగిసే సరికి సంగారెడ్డి జిల్లా పోలీస్ జట్టు 5 పతకాలను కైవసం చేసుకుంది.
పతకాలు సాధించిన క్రీడాకారులు వివరాలు:

1.సంతోష్ కుమార్ సిల్వర్ మెడల్
2.ఎల్. చంద్ర శేఖర్, ఎఆర్ పిసి -- సిల్వర్ మెడల్
3. డి. మధు, ఎఆర్ పిసి -- సిల్వర్ మెడల్
4. దేవి సింగ్, ఎఆర్ పిసి -- కాంస్య పతకం
5. ఎల్. రవీందర్, ఎఆర్ పిసి -- కాంస్య పతకం
6. కె. శ్రావ్య, ఎఆర్ పిసి -- కాంస్య పతకం

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ, విజేత క్రీడాకారులను అభినందిస్తూ క్రీడా పోటీల్లో విజయం సాధించడం ద్వారా శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు భవిష్యత్తులో జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.వివిధ క్రీడా విభాగాలలో పోటీ పడి తమ ప్రతిభను చాటిన క్రీడాకారులు సంగారెడ్డి జిల్లాకు గౌరవాన్ని తీసుకువచ్చారని, జిల్లా పోలీస్ శాఖ తరపున విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# జిల్లా విజిలెన్స్ డ మాన్యువల్ స్కావెంజింగ్ కమిటీ సమావేశం

**- కేసుల పరిష్కారానికి వేగం పెంచాలని కలెక్టర్ ఆదేశం**






**మన మహతి న్యూస్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఫిబ్రవరి 18 ప్రతినిధి**
మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బుధవారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మరియు మాన్యువల్ స్కావెంజింగ్ నిర్మూలన కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ జి. వెన్నెల హాజరయ్యారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతి, బాధితులకు అందాల్సిన పరిహారం చెల్లింపులు, కేసుల విచారణలో ఆలస్యం వంటి అంశాలను సమీక్షించారు. అలాగే మాన్యువల్ స్కావెంజింగ్ నిర్మూలనకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై వివరంగా చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్‌తో పాటు డివిఎంసి కమిటీ సభ్యులు, పోలీస్ ఉన్నతాధికారులు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు చట్టపరమైన సహాయం, పరిహారం సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాన్యువల్ స్కావెంజింగ్ వంటి చట్టవ్యతిరేక పద్ధతులు ఎక్కడా జరగకుండా కఠినంగా పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

# నాగారంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా

**- బంజారా సంప్రదాయ నృత్యాలతో భక్తి పారవశ్యం**





**మన మహతి న్యూస్ మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ సర్కిల్ నాగారం, ఫిబ్రవరి 18:** బంజారాల ఆరాధ్య దైవం, ఆధ్యాత్మిక గురువు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను నాగారంలో అత్యంత వైభవంగా, భక్తి భావంతో నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. బంజారా సంప్రదాయ వేషధారణలతో యువతులు, మహిళలు నృత్యాలు ప్రదర్శించగా వేడుకలు అంబరాన్నంటాయి. ఈ మహోత్సవానికి నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, బోర్వెల్ కుషాయిగూడ జోన్ అధ్యక్షులు కందడి శ్రీనివాస్ రెడ్డి, రెడ్యా నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ యూత్ అధ్యక్షులు భద్రు నాయక్, సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ధీరావత్ హనుమంతు నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ అందించిన ఆధ్యాత్మిక సందేశాలు, అహింసా సిద్ధాంతం, సమాజ సేవా తత్వాన్ని కొనియాడారు. ఐక్యత, సేవా భావం, సామాజిక సౌభ్రాతృత్వం పట్ల ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. బంజారా జాతి అభ్యున్నతికి సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడవాలని ఆకాంక్షించారు.వేడుకల్లో ఉత్సవ కమిటీ నాయకులు, బంజారా సోదరీసోదరీమణులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, శాస్త్రవేత్తలు, యూనియన్ నాయకులు మరియు వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# క్షేత్రస్థాయి సందర్శన శిక్షణలో అత్యంత కీలకం జిల్లా కలెక్టర్.పి.ప్రావీణ్య

**- గ్రామల అభివృద్ధి భేష్ .గ్రూప్ వన్ అధికారులు**






**సంగారెడ్డి, ఫిబ్రవరి 18, మన మహతి న్యూస్ :**
క్షేత్రస్థాయి సందర్శన శిక్షణతో అధికారులు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునేందుకు అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పథకాల అమలు, ప్రజల జీవన విధానం, అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం వంటి అంశాలను నిశితంగా పరిశీలించి ఆకళింపు చేసుకున్నప్పుడే భవిష్యత్తులో సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించగలమన్నారు.రెండు రోజుల శిక్షణలో భాగంగా జిల్లాలోని బడంపేట, సజ్జాపూర్, అనంతసాగర్, మల్లేపల్లి, గొంగళూరు, బస్వాపూర్, అరూర్, వెల్టూర్, అల్గోల్, మల్ చల్మా గ్రామాలను సందర్శించిన ఆరు శాఖలకు చెందిన 60 మంది గ్రూప్-వన్ ప అధికారులు తమ శిక్షణను పూర్తి చేసుకొని బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.గ్రామాల్లో నిర్వహిస్తున్న పలు శాఖల పనితీరు, పాఠశాలలు, పీహెచ్‌సీలు, అంగన్వాడీ కేంద్రాలు, అమలవుతున్నప్రభుత్వ పథకాలు, ఎన్ఆర్ఈజీఎస్ పనులను పరిశీలించిన అధికారులు గ్రామ ప్రజలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వారితో సమావేశమైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ మరియు జిల్లా అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని, ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. పరిపాలనలో పారదర్శకత, సమర్థత, ముఖ్యమని వివరించారు.ఈ సందర్భంగా పలువురు గ్రూప్-వన్ అధికారులు మాట్లాడుతూ, గ్రామాల్లో ఇందిరా మహిళ కార్యక్రమం సమర్థవంతంగా అమలవుతోందని, స్వయం సహాయక సంఘాల మహిళలు రుణాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు ప్రత్యక్షంగా గమనించామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని, గ్రామాల అభివృద్ధి బేశుగ్గా ఉందని కితాబునిచ్చారు.ఈ పర్యటన తమకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జడ్పీ సీఈవో జానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన పురోగతి సాధించాలి.జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య.





**సంగారెడ్డి, ఫిబ్రవరి 18,మన మహతి న్యూస్**
:ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సమర్థవంతంగా అమలు చేసి, స్పష్టమైన పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్ నుండి ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో ప్రి--ఎస్.ఐ.ఆర్ పురోగతిపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రం వారీగా పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనితీరులో వెనుకబడి ఉన్న ఆయా ఏఈఆర్ఓ లను కారణాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 51.96 శాతం మాత్రమే ఓటర్ మ్యాపింగ్ పూర్తయిందని,ప్రత్యేకంగా అర్బన్ సెగ్మెంట్‌లో పురోగతి తక్కువగా ఉన్నందున డోర్ టు డోర్ సందర్శనల ద్వారా ఓటర్ మ్యాపింగ్ వేగవంతం చేసి, పది రోజుల్లో కనీసం 85 శాతం పురోగతి సాధించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. తక్కువ పురోగతి ఉన్న బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో చర్చించి సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ఏఈఆర్ఓలు వారం రోజుల పాటు ప్రతిరోజూ మూడు ప్రాంతాల్లో ఆకస్మిక క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి, రోజువారీ సమీక్ష చేయాలని స్పష్టం చేశారు.పనితీరు సంతృప్తికరంగా లేని బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్ మ్యాపింగ్‌లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొత్తగా విలీనం అయిన ప్రాంతాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్‌కు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## విస్సన్నపేట -టు- సత్తుపల్లి రోడ్డు ట్రాఫిక్ కు ఇబ్బంది కరం గా ఉంది - అధికారులు స్పందించి ట్రాఫిక్ నుండి పరిష్కారం చూపించండి



**మన మహతి ప్రతినిధి:భ్రమరాంబ విసన్నపేట న్యూస్:ఫిబ్రవరి.20**
ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట నుండి సత్తుపల్లి వెళ్లే రోడ్డు విజయవాడ విసన్నపేట మీదగా సత్తుపల్లి తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లోకి వెళ్లేటువంటి ఈ రోడ్డు బస్సులు ఆటోలు లారీలుతో అత్యంత ట్రాఫిక్ తో ఉంటుంది.ఇరుకు రోడ్డు అదే రోడ్డు లో లారీ లతో సరుకులు దింపుకొనేందుకు లారీలు రోడ్డు ను పూర్తిగా అక్రమిస్తే ఇతర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు వాహనదారుల పరిస్థితిలు ఇబ్బందికరంగా ఉంటాయని ఆ ఏరియాకి చెందిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.
విస్సన్నపేట అధికారులు ఈ విషయంపై స్పందించి పరిశీలన చేసి ఈ ఇరుకు రోడ్డు నుండి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించవలసిందిగా.ప్రజలు కోరుతున్న స్థానిక ప్రజలు

## అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి.





**సంగారెడ్డి, ఫిబ్రవరి 18,మన మహతి న్యూస్ :**
సదాశివపేట మండలం మద్దికుంట, ఏటి గడ్డ సంఘం, తంగెడుపల్లి గ్రామాలలో బుధవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పర్యటిం చారు. ఏటి గడ్డ సంఘం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్య కమం లో పాల్గొన్నారు. అనంతరం మద్ది కుంట గ్రామం లో ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాల తో పాటు గ్రామంలోని నూతనంగా నిర్మించబోయే స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి ఆమె భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా తంగేడుపల్లి గ్రామం లో సైతం స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ లు, నాయకులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా బండారుపల్లి గ్రామం రిటైర్డ్ టీచర్ బానోత్ మజ్జు నాయక్ మాతృమూర్తి కీర్తిశేషులు బానోతు రాధాబాయి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన మాజీ ఎంపీ సీతారాం నాయక్ వెల్ఫేర్ ప్రెసిడెంట్ వీ ఎన్ నాయక్







**ములుగు జిల్లా** బండారుపల్లి గ్రామం మాతృమూర్తి కీర్తిశేషులు రాధాబాయి వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ లిఅధ్యక్షులు ఎచీ నాయక్,మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, డాక్టర్ రూప్ శంకర్ నాయక్,రిటైర్డ్ కలెక్టర్ మోహన్ లాల్ . ఎల్ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్ రిటైర్డ్ భారతీయ భారతీయ నాయక్. స్థానిక కౌన్సిలర్ పోరిక రాజు నాయక్. రిటైర్డ్ జిసిసి మేనేజర్ హరిలాల్ నాయక్ జర్నలిస్ట్ లావుడియా రాజు నాయక్ శ్రావణ్ నాయక్. డాక్టర్ చందు, గంగు నాయక్, గోవర్ధన్, రతన్ సింగ్,లక్ష్మణ్,పరం సింగ్, చరణ్ సింగ్, రాందాస్, రామన్న, సత్రం, వసంతం, దేవ్ సింగ్, సక్రు నాయక్, డాక్టర్ భోజ నాయక్, రాజు నాయక్, డాక్టర్ ఉదయ్ సింగ్, గ్రామ పెద్ద మనుషులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించినారు

## గంపలగూడెం పట్నంలో 23.వ రోజు డ్రగ్స్ పై దండయాత్ర అవగాహన ర్యాలీ

**- మహిళా పోలీసులు చేపట్టిన సైకిల్ యాత్రకు ఘన స్వాగతం!**

**- పలికిన గ్రామస్తులు-పోలీసు-తెదేపా నేతలు!**



**మన మహతి ప్రతినిధి:భ్రమరాంబ గంపలగూడెం న్యూస్:ఫిబ్రవరి .20**
గంపలగూడెం పట్టణంలో 23.వ రోజు డ్రగ్స్ పై దండయాత్ర అవగాహన ర్యాలీ కార్యక్రమంలో తోటమూల సెంటర్ లో విద్యార్థుల తో కలసి నిర్వహించిన మానవహారం.డ్రగ్స్ పై దండయాత్ర సైకిల్ ర్యాలీ మెయిన్ సెంటర్ నుండి తోటమూల రింగ్ సెంటర్ వరకు ఏసీపీ వై.ప్రసాదరావు,సీఐ కే.గిరిబాబు,తహసిల్దార్ వి.రాజకుమారి,ఎస్సై జీ.అనిల్,సిబ్బంది మరియు విద్యార్థులతో కలిసి నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు విభాగం అధ్యక్షుడు చెరుకూరి రాజేశ్వరరావు, ఏయంసీ చైర్మన్ రేగళ్ళ లక్ష్మీ అనిత వీరారెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు మానుకొండ రామకృష్ణ (ఎం ఆర్ కే),గంపలగూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు కాజా రవికుమార్, బూరుగు నారాయణ,వేముల బాలయ్య,భూమిశెట్టి రామలక్ష్మి, మండల ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి అంతర్గత మార్కులు పరిశీలన

**- సీసీఈ మూల్యాంకన పద్ధతి ద్వారా పరిశీలన: ఎంఈఓ శ్రీరామ్ మూర్తి**

**మన మహతి న్యూస్ పాల్వంచ రూరల్** పాల్వంచ మండలంలోని పదో తరగతి విద్యార్థుల అంతర్గత మార్కుల పరిశీలన బుధవారంతో ముగిసింది. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు 8 బృందాలు ఏర్పాటయ్యాయి.ప్రతి సబ్జెక్టుకు 80 మార్కులతో పాటు ఫార్మేటివ్ పరీక్షలు, ప్రాజెక్టులు ఆధారంగా 20 ఇంటర్నల్ మార్కులు కేటాయిస్తారు. ఇవి సక్రమంగా ఇచ్చారా అనే విషయంపై బృందాలు తనిఖీలు చేస్తున్నాయనీ మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. ఈ పరిశీలనలో వివిధ పాఠశాలల టీమ్ హెడ్ మరియు టీం మెంబర్ గా ఉన్న ఉపాధ్యాయులు, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు




## అగ్నివీర్ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల

**- 2027 రిక్రూటింగ్ సంవత్సరానికి దరఖాస్తులు ప్రారంభం -- కలెక్టర్ మను చౌదరి**

**మన మహతి న్యూస్ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా, ఫిబ్రవరి 18:**
భారత సైన్యంలో చేరి దేశ సేవ చేయాలనుకునే యువతకు సువర్ణావకాశం లభించిందని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఒక ప్రకటనలో తెలిపారు. 2027 రిక్రూటింగ్ సంవత్సరానికి గాను ఇండియన్ ఆర్మీ లో అగ్నివీర్ అన్ని కేటగిరీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైనట్లు ఆయన పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం నుండి పెద్ద సంఖ్యలో యువకులు ఆర్మీలో చేరేలా ప్రోత్సహించేందుకు ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియను చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అర్హత గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ముఖ్య వివరాలు:అభ్యర్థులు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రిజిస్ట్రేషన్లు ఫిబ్రవరి 18 నుండి ప్రారంభమై ఏప్రిల్ 01, 2026 వరకు కొనసాగనున్నాయి. అగ్నివీర్ అన్ని కేటగిరీలకు సంబంధించిన విద్యార్హతలు, వయోపరిమితి, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలు నోటిఫికేషన్‌లో పొందుపరిచినట్లు తెలిపారు.ఆసక్తి కలిగిన అర్హులైన యువకులు గడువు ముగిసేలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని భారత సైన్యంలో చేరి దేశ రక్షణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ మను చౌదరి పిలుపునిచ్చారు.




# ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో తుదినిర్ణయం ఆర్‌వోదే : హైకోర్టు



**ఇబ్రహీంపట్నం :** ఎట్టకేలకు ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికకు అడ్డంకి తొలగింది. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికలో తుదినిర్ణయం ఆర్‌వోదేనని హైకోర్టు స్పష్టం చేసింది. బీఆర్?ఎస్? కౌన్సిలర్ యాదగిరిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావొద్దని రంగారెడ్డి కలెక్టర్, పోలీసులను హైకోర్టు ఆదేశించింది. యాదగిరి స్వచ్ఛందంగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణ ముగించింది.రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ పీఠంపై విధించిన స్టేను హైకోర్టు ఎత్తివేసింది. ఛైర్మన్ ఎన్నికపై తుది నిర్ణయం ఆర్వోదేనని స్పష్టం చేసింది. మంగళవారం మున్సిపల్ కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక వేళ తన తండ్రి కనిపించడం లేదని 19వ వార్డు నుంచి గెలుపొందిన యాదగిరి కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఈ ఎన్నికపై విచారణ చేపట్టిన హైకోర్టు స్టే విధించింది. ఇవాళ విచారణకు యాదగిరిని కోర్టులో హాజరుపరచాలని నిన్న హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ క్రమంలో ఇవాళ కోర్టులో విచారణకు కౌన్సిలర్ యాదగిరి హాజరయ్యారు.అపహరణపై కోర్టులో పిటిషన్ : మంగళవారం హైకోర్టు స్టే ఉత్వర్వులు అందే సమయానికి మున్సిపల్ ఛైర్మన్‌గా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎన్నికైనా కూడా న్యాయస్థానం స్టే కారణంగా ఎన్నికల అధికారి అతనికి ధ్రువీకరణపత్రం ఇవ్వలేదు. 19 వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడని ఆయన కుమారుడు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడం, అనూహ్యంగా కౌన్సిలర్ యాదగిరి బీఆర్?ఎస్? క్యాంపులో కౌన్సిల్ ఎన్నికకు హాజరవటం వంటి పరిణామాల మధ్య హైకోర్టు ఎన్నికపై స్టే విధించింది.అంతకు ముందు ఇబ్రహీంపట్నం మున్సిపల్? కార్యాలయంలో ఉద్రిక్తత నెలకొంది. కౌన్సిల్ హాలులో బీఆర్?ఎస్?, కాంగ్రెస్ కౌన్సిలర్లు పరస్పర దాడులు చేసుకున్నారు. రహస్య ఓటింగ్ చేయాలని కాంగ్రెస్ కౌన్సిలర్లు డిమాండ్ చేయగా నిబంధనల ప్రకారమే ఓటింగ్ నిర్వహించాలని బీఆర్?ఎస్ కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, పరస్పర దాడులు చోటు చేసుకున్నాయి. ఎన్నికకు ఎక్స్ అఫీషియో సభ్యుడు మల్ రెడ్డి రంగారెడ్డి గైర్హాజరయ్యారు.బలవంతంగా బాపట్లకు : హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ఈరోజు బీఆర్ఎస్ కౌన్సిలర్ యాదగిరిని ఇబ్రహీంపట్నం ఉదయం పోలీసులు హైకోర్టులో హాజరుపంచారు. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, కుమారుడు బలవంతంగా బాపట్ల జిల్లా చీరాల తీసుకెళ్లినట్లు యాదగిరి కోర్టుకు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బీసీ అభ్యర్థిగా మున్సిపల్ ఛైర్మన్ రేసులో ఉన్నాననే బౌన్సర్లను పెట్టి మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు. ఈనెల 16న ఉదయం నుంచి రాత్రి వరకు కారులోనే తిప్పారని వాపోయారు. తనకు బీపీ, షుగర్ ఉన్నా భోజనం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేసిన కౌన్సిలర్ యాదగిరి తాను లేకపోతే కోరమ్ ఉండదని భావించే ఈ పని చేశారన్నారు. తాను తన కుమారుడు పిటిషన్ వేశారని కోర్టులో తెలిపారు.తుది నిర్ణయం ఆర్?వోదే : తన మొబైల్? ఫోన్? కూడా మాజీ ఎమ్మెల్యే కుమారుడు ప్రశాంత్ రెడ్డి దగ్గరే ఉందని యాదగిరి కోర్టుకు తెలిపారు. తనకు వారి నుంచి ప్రాణహాని ఉందని భద్రత కల్పించాలని కోరారు. అనారోగ్యం ఉన్నందున రెండు రోజులు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటానని విజ్ఞప్తి చేశారు. ఛైర్మన్ ఎన్నిక విషయంలోనే యాదగిరి మాట మారుస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు. బీఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థికి ఇప్పటికే 15 మంది అభ్యర్థుల మద్దతు ఉందని, చట్ట ప్రకారం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సకాలంలో జరగాలన్న మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలను పరిశీలించిన న్యాయస్థానం ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక నిర్ణయం ఆర్‌వోదేనని స్పష్టం చేసింది.

# యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలకు శ్రీకారం.. వేద మంత్రాలు, మంగళవాయిద్యాలతో ఆధ్యాత్మిక సందడి

**హైదరాబాద్ :** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధాన ఆలయంలో బ్రహ్మో త్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ మూల వర్యుల అనుమతితో నిజాభిషేకం, విశ్వక్సే నారాధన, జలపూజ, పుట్టమ ట్టిలో నవధాన్యాలు నాటడం తోపాటు స్వస్తివాచనం వంటి వైదృశ్య కార్యక్రమాలతో బుధవారం బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. ఉదయం 10 గంట లకు స్వస్తి వాచన ఘట్టాన్ని ప్రారంభించారు. సకల దేవకోటిని ఉత్సవాలకు విచ్చేసి సర్వలోకాలకు క్షేమాన్ని కలిగించమని వేడుకునే కార్య్ర కమం పాంచరాత్రాగమ శాస్త్ర ప్రకారం జరిపారు. తొలి పూజల్లో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఆనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటా చార్యులు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొ న్నారు. లక్ష్మీనరసి ంహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘ టాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధి కారు రద్దు చేశారు.బ్రహ్మోత్సవాలు ఇలా..ఫిబ్రవరి 18 న స్వస్తి వాచనం, విష్వక్సేన ఆరాధన, సాయంత్రం మత్స్యగ్రహణం, అంకు రార్పణఫిబ్రవరి 19న ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం,



సాయంత్రం భేరి పూజ.ఫిబ్రవరి 20 న ఉదయం మత్స్యావతార అలంకారం, సాయంత్రం శేష వాహన సేవ వేదపారా యణములు. రాత్రి 7 గంటలకు శేష వాహన సేవఫిబ్రవరి21 న ఉదయం వటపత్రశాయి అలంకార సేవ, రాత్రి హంస వాహన సేవఫిబ్రవరి22 న శ్రీ కృష్ణాలంకార సేవ, రాత్రి పొన్న వాహన సేవ.ఫిబ్రవరి23 న ఉదయం గోవర్ధన గిరి ధారి, సాయంత్రం సింహ వాహన సేవఫిబ్రవరి 24 న జగన్మోహినీ అలంకార సేవ, అశ్వ వాహనం పై రాత్రి ఎదుర్కోలు వేడుకఫిబ్రవరి 25 న రాత్రి స్వామివారి తిరుకల్యాణ మహోత్సవంఫిబ్రవరి 26న రాత్రి 8 గంటలకు దివ్యవిమాన రథోత్సవంఫిబ్రవరి27 న స్వామి వారి

# క్యాతన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ అరెస్ట్



**మంచిర్యాల :** మున్సిపల్ ఎన్నికల్లో దౌర్జన్యాలకు పాల్పడ్డ కాంగ్రెస్ నాయకులు అదే పంథాను ఇంకా కొనసాగిస్తూనే ఉన్నారు. ఎన్నికల్లో మెజారిటీ లేకపోయినా బెదిరింపులు, దాడులకు పాల్పడుతూ కైవసం చేసుకుంటున్నారు.మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి లో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ ఎన్నిక జరుగకుండా అడుగడుగునా పోలీసుల సహకారంతో అడ్డుకుంటు న్నారు. కాంగ్రెస్ దౌర్జన్యాలను అడ్డుకుంటున్న బీఆర్ఎస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బుధవారం పోలీసులు అరెస్టు చేశారు.గత రెండు రోజులుగా బాల్క సుమన్ ఇంటిని ముట్టడించిన పోలీసులు ఇవాళ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో బాల్కసుమన్‌కు నోటీసులు అందజేసి అరెస్టు చేశారు. క్యాతన్ పల్లి మున్సిపాలిటీని ఎట్లైనా చేజిక్కించుకోవాలనే కుట్రతో కాంగ్రెస్ ప్రభు త్వం అక్రమ కేసులు పెడుతున్నదని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు.తమపై కాంగ్రెస్ నాయకులు రాళ్ళు రువ్వడమే కాకుండా పోలీసులు తమపై లాఠీచార్జ్ చేసి, మళ్లీ కేసులు కూడా తమ మీదే పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిగ్గులేకుండా కొంత మంది పోలీసులు మంత్రి వివేక్ కు ఊడిగం చేస్తున్నారని, ఈ అక్రమ కేసులకు, బెదిరింపులకు భయపడేది లేదని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో అనుమతి లేకుండానే వైద్యం.. 250 ప్రైవేటు హాస్పిటల్స్ సీజ్‌కు రంగం సిద్ధం..




**హైదరాబాద్ :** మేడ్చల్ జిల్లాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న 250 ప్రైవేటు ఆసుపత్రులపై కొరడా ఝుళిపించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సిద్ధమైంది. ఆయా ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గత ఆరు నెలలుగా చేపట్టిన సర్వేలో ఈ అక్రమాలు వెలుగుచూశాయి. నిబంధనలు ఉల్లంఘి ంచిన యాజమాన్యాలకు మూడు రోజుల గడువునిస్తూ.. అప్పటి వరకు కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు.

హైలైట్:అనుమతి లేకుండానే వైద్యంవిద్య, వైద్యంతో వ్యాపారం చేయకూడదని అంటుంటారు. కానీ ప్రస్తుతం ఆ రెండే ప్రధాన వ్యాపారాలుగా మారాయి. కొందరు అక్రమార్జనే ధ్యేయంగా ఎలాంటి అనుమతులు లేకుండానే హాస్పిటల్స్ ఓపెన్ చేసి వైద్యం చేస్తున్నారు. కొందరైతే నకిలీ డాక్టర్లతో వైద్యం చేయిస్తూ.. ప్రజల ప్రాణాల మీదుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లాలోని ప్రైవేటు హాస్పిటల్స్‌పై తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది.నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఉండాల్సిన ముందస్తు రిజిస్ట్రేషన్ లేకుండానే వైద్య సేవలు నిర్వహిస్తున్న దాదాపు 250 ప్రైవేటు ఆసుపత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు నిర్ణయించారు. వీటిలో హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని 224 ఆసుపత్రులు ఉండగా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మరో 26 హాస్పిటల్స్ ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో గత ఆరు నెలలుగా ఫేక్ డాక్టర్లు, అనధికార హాస్పిటల్స్‌ను గుర్తించేందుకు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో ఈ అక్రమాలు వెలుగుచూశాయి.హైదరాబాద్ జిల్లా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వైద్య వృత్తిలో ఉన్నవారు నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా హాస్పిటల్స్ నడపడం సరికాదని పేర్కొన్నారు. నోటీసులు అందుకున్న హాస్పిటల్స్ తమ వద్ద ఉన్న పత్రాలను సమర్పించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసే వరకు కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే.. అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా డాక్టర్లను ఇతర సిబ్బందిని నియమించుకున్న హాస్పిటల్స్‌పైనా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడి ంచారు .మరోవైపు అర్హత లేని వ్యక్తులు హాస్పిటల్స్ నడుపుతున్నట్లు తేలితే వాటిని తక్షణమే సీజ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నారు. నోటీసులు అందుకున్న హాస్పిటల్స్ సరైన వివరణ ఇవ్వకుంటే నేషనల్ మెడికల్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 50 వేల నుంచి 5 లక్షల రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని ౧+వీజ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ గుండగాని శ్రీనివాస్ తెలిపారు.హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం సుమారు 4 వేల వరకు ప్రైవేటు హాస్పిటల్స్, క్లినిక్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లు ఉన్నాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఫేక్ డాక్టర్లను ఏరివేసేందుకు అధికారులు ప్రస్తుతం వైద్యుల సర్టిఫికెట్లను, లైసెన్సులను నిశితంగా పరిశీలిస్తున్నారు. గత కొన్నేళ్లుగా వందలాది మంది ఫేక్ డాక్టర్లపై ఇప్పటికే కేసులు నమోదైన నేపథ్యంలో..

తాజా తనిఖీలు నగర వైద్య రంగంలో కలకలం రేపుతున్నాయి.

# మెదక్ జిల్లా కొల్చారంలో రోడ్డు ప్రమాదం.. బట్టల వ్యాపారి దుర్మరణం



**మెదక్ జిల్లా :**మెదక్ జిల్లా కొల్చారం గ్రామ శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. అతివేగంగా వచ్చిన ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

మృతుడిని మెదక్ పట్టణానికి చెందిన వీవీ సిల్క్స్ బట్టల షాపు యజమాని వనపర్తి రోహిత్ గుప్తా (50) గా గుర్తించారు. క్షతగాత్రుడిని ఎల్లారెడ్డికి చెందిన విజయ్‌గా గుర్తించారు. వీరు విజయవాడకు వెళ్లి తిరిగొస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

యాక్సిడెంట్ గురించి సమాచారం తెలియగానే పోలీసులు ఘటనాస్థలికి వచ్చి పరిశీలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

# ఈ నెల చివరిలోగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు.. గుడ్‌న్యూస్ చెప్పిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, మల్కాజిగిరి :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న పేదలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలో ఇళ్ల స్థలాలు ఉన్న పేదలకు ఫిబ్రవరి చివరి వారంలోగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను ఇవ్వాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న పేదలకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల క్యూర్ పరిధిలో త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం (ఫిబ్రవరి 17) సెక్రటేరియట్‌లో క్యూర్ పరిధిలో హౌసింగ్ పాలసీపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ మురికివాడల్లో నివసిస్తున్న పేదలు ఇతర ప్రాంతాల్లో ఇళ్లను తీసుకోవటానికి ఇష్ట పడటం లేదని అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. నగరానికి దూరంగా వెళితే.. తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందని వారు ఆసక్తి చూపటం లేదని వివరించారు.గతంలో 42 వేల నివాసాలు నిర్మించగా అందులో సగం మంది మాత్రమే శివారు ప్రాంతాల్లో నివసిస్తున్నారని తమ సర్వేలో తేలినట్లు హౌసింగ్ శాఖ అధికారులు చెప్పారు. దీంతో నిరుపేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి నివాస ప్రాంతాలకు దగ్గరగా ఇళ్లను నిర్మించే ఆలోచన చేయాలన్నారు. మురికివాడల్లో స్థలం ఉన్నవారు అంగీకరిస్తే ఐదు నుంచి పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. కేబినెట్ సమావేశంలో ఈ విషయంపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. హైదరాబాద్ నగరంలోని మూడు కార్పొరేషన్ల కమిషనర్లు, 4 జిల్లాల కలెక్టర్లు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. అక్కడ ఉన్న లబ్ధిదారులు, ఎన్ని ఇళ్లను నిర్మించవచ్చుననే వివరాలతో పది రోజుల్లో నివేదిక అందించాలన్నారు. శిథిలావస్థకు చేరిన జేఎన్ఎన్‌యూఆర్ఎం



నివాసాల స్థానంలో కూడా కొత్తగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే ఆలోచన చేస్తున్నామని చెప్పారు.

మూడు కార్పొరేషన్ల పరిధిలో ఇళ్ల స్థలాలు ఉన్న మట్నత్తం 28 వేల మంది లబ్ధిదారులకు ఈ నెల చివరిలోగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లతో పాటు ఇప్పటికే పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లకు మార్చి చివరి నాటికి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులను ఆదేశించారు. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయడంతోపాటు మౌలిక వసతులకు హౌసింగ్ కార్పొరేషన్ నుంచి మంజూరు చేయాలని సూచించారు. విద్యుత్ పంపిణీ సంస్థలు కరెంట్ మీటర్లను డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల పేర్లమీదకు బదిలీ చేయాలన్నారు.

# క్యాతనపల్లిలో కొనసాగుతన్న బంద్.. బాల్క సుమన్ ఇంటి ముందు మోహరించిన పోలీసులు



**క్యాతనపల్లి :**క్యాతనపల్లి మున్సిపల్ కౌన్సిల్‌లో ఆడ బిడ్డలపై మీద కాంగ్రెస్ దౌర్జన్యం చేయ డాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్, సీపీఐ ఆధ్వర్యంలో బంద్ కొనసాగుతోంది. మున్సి పాలిటీలోని వ్యాపారులు, వివిధ సంఘాలు, ప్రజలు ప్రజా తీర్పుకు మద్దతు తెలిపి బంద్‌లో పాల్గొన్నారు.

బంద్ సందర్భంగా మున్సిపాలిటీలో భారీగా పోలీసులు మోహరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్యను హౌస్ అరెస్టు చేశారు. ఇక నిన్న మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా పోలీసు సిబ్బందిపై దాడి చేశారని బాల్క సుమన్‌పై కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో బాల్క సుమన్‌ను అరెస్టు చేసేందుకు భారీగా పోలీసులు ఆయన ఇంటి ముందు చేరుకున్నారు. ఈ విషయం తెలిసి భారీగా బీఆర్ఎస్ శ్రేణులు అక్కడకు చేరుకున్నాయి. దీంతో బాల్క సుమన్ ఇంటి ముందు ఉద్రిక్తత నెలకొంది.

Printed, Published & Owned by Boda prakash s/o krishna h.no 3-2 satyanarayana puram Edulapuram khammam rural Telanagana 507003 , Printed at Maddineni Nageshwara Rao , H.NO 1-17-18 , Svn Colony, Edulapuram, khammam rural Telanagana 507003, EDITOR : Boda prakash PH : 9000005078 & 9133935333 , RNI. NO TGTEL/26/A0372. EMAIL: manamahati@gmail.com